క్లుప్తంగా

పెన్షన్‌లకు దరఖాస్తు చేసుకోవాలి



కొత్త పింఛన్లను అందజేస్తున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ సత్యబాబు

మణికొండ: అర్హులైన వారు వితంతు, వృద్ధాప్య పెన్షన్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ సత్యబాబు సూచించారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా మంజూరు అయిన ఆరుగురికి పెన్షన్ పత్రాలను కౌన్సిలర్ ఉషారాణితో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్య పెన్షన్ పొందున్న వ్యక్తి మృతి చెందిన అతని భార్యకు వెంటనే వితంతు పింఛన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వారి ఆధార్ కార్డు, చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువపత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలోని అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఉగాది వేడుకలు



వేడుకలో పాల్గొన్న శ్రీధర్‌బాబు, సీతక్క

రాయదుర్గం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు సంవత్సరాది వేడుకలను అందరూ ఘనంగా జరుపు కోవాలన్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేయడం విశేషమన్నారు. అనంతరం విద్యార్థుల సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీసీసీ శేరిలింగంపల్లి ప్రతినిధి సత్యనారాయణరావు, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరివెంకట్, రాష్ట్ర ఇన్‌చార్జి అక్షయ్ లక్రా, జాతీయ కోఆర్డినేటర్ ఆజమ్ పాల్గొన్నారు.

మనూలో ఘనంగా 'నౌరూజ్' పండుగ



ఐనుల్‌హసన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నిర్వాహకులు

రాయదుర్గం: సార్వత్రిక సోదరభావం, ఐఖ్యత, సమగ్రత, సంఘీభావాన్ని ప్రోత్సహించే 'నౌరూజ్ పండుగ'ను గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పర్షియన్ అండ్ సెంట్రల్ ఏషియన్ స్టడీస్ విభాగం(డీపీ అండ్ సీఏఎస్) ఆధ్వర్యంలో ఈ పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ.. నౌరూజ్ పండుగకు మూడు వేల సంవత్సరాల చరిత్ర ఉందని ఈ పర్వదిన సాంస్కృతిక ప్రాముఖ్యతను విస్మరించలేమని స్పష్టం చేశారు. దక్కన్ ప్రాంతంలో నౌరూజ్‌పై గరిష్ట సంఖ్యలో ద్విపదలను రాయడంలో ప్రత్యేకతను కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెనడాకు చెందిన ప్రఖ్యాత ఉర్దూ, పర్షియన్ కవి డాక్టర్ సయ్యద్ తఖీ ఆబేదీ పాల్గొని పండుగ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ నూర్ ఇంటర్నేషనల్ మైక్రో ఫిల్మ్ సెంటర్ సౌత్ ఇండియన్ స్టేట్స్ రీజినల్ డైరెక్టర్ అలీ అక్బర్ నిరూమండ్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ అజీజ్‌బానో, డాక్టర్ సయ్యిదా అస్మత్ జహాన్, డాక్టర్ ఖైజర్‌అహ్మద్, ఎండీ రిజ్వాన్, డాక్టర్ జనైద్ అహ్మద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

యువకుడి అదృశ్యం



బిక్కీ కుమార్

రాజేంద్రనగర్: యువకుడు అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. బిహార్‌కు చెందిన దినేష్ పదేళ్లుగా మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్నాడు. దినేష్ కుమారుడు బిక్కీకుమార్(23) లేబర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 22న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేశారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అధునాతన హంగులతో రాణా

తీరనున్న పోలీసుల వెతలు

- నేడు నార్సింగి స్టేషన్ ప్రారంభం



నార్సింగిలో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం

మణికొండ: నిజాం కాలంలో కట్టిన భవనంలో ఒక ఎస్సైతో ప్రారంభమైన నార్సింగి పోలీస్‌స్టేషన్ ఎట్టకేలకు నూతన భవనంలోకి మారనుంది. ఇరుకు గదులు, అరకొర సౌకర్యాలతో సంవత్సరాల పాటు తీవ్ర ఇబ్బందులు పడిన వారి వెతలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఐదు దశాబ్దాల క్రితం నార్సింగి కేంద్రంగా పోలీస్‌స్టేషన్ ఒక ఎస్సై పదుల సంఖ్యలో కానిస్టేబుల్‌లతో ప్రారంభమయ్యింది. అప్పటి నుంచి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఇద్దరు ఎస్సైలు, నలుగురు ఎస్సైలు, ఒక సీఐ, ఇద్దరు సీఐలు, వేరుగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇలా ఎదుగుతూ వచ్చింది. ప్రస్తుతం నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఓ సీఐ, ఓ క్రైం సీఐలతో పాటు ఆరుగురు ఎస్సైలు పనిచేస్తున్నారు. వీరికి తోడుగా ఈ మధ్యనే నార్సింగి కేంద్రంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరు అయి ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలతో పదుల సంఖ్యలో సిబ్బందితో కొనసాగుతుంది. ఇటీవల నార్సింగిని కొత్తగా ఏసీపీ డివిజన్‌గా చేశారు. ఏసీపీ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు ఇరుకైన భవనంలోనే లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లను కొనసాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు, సిబ్బంది కూర్చునేందుకు స్థలాలు లేక బయట వరాండాలో కుర్చీలు వేసుకుని కూర్చుని విధులు నిర్వహించారు.



స్టేషన్ ముందర వాహనాలు ఆపేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం

ఎట్టకేలకు ముహూర్తం..

నార్సింగి కేంద్రంగా నూతన పోలీస్‌స్టేషన్ నిర్మించాలని ఐదేళ్ల క్రితం అప్పటి ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా అప్పటికే కొనసాగుతున్న ఎస్‌ఓటీ కార్యాలయం ఆవరణలోనే నిర్మించాలని పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి వచ్చిన ప్రతి అధికారి హయాంలో ఎంతో కొంత పనులు కొనసాగుతూ మూడు అడుగులు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా పనులు కొనసాగాయి. నార్సింగి ఏసీపీ డివిజన్‌గా మారకముందే స్టేషన్ పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించాలని నిర్ణయించినా సాధ్యం కాలేదు. అంతలో కొత్త డివిజన్‌లు, జోన్‌లు, పోలీస్‌స్టేషన్‌లు వచ్చాయి. దీంతో నూతన భవనంలోనే ఏసీపీకి చివరి అంతస్తులో గదులు కేటాయించాలని నిర్ణయించి మరో సారి మార్పులు చేపట్టారు. అంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావటంతో నెల రోజుల నుంచి ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగిపోవటంతో శుక్రవారం హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా ఉదయం 11గంటలకు ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.

కార్పొరేట్ కార్యాలయాన్ని తలదన్నేలా..

నార్సింగిలో ఔటర్ రింగ్ రోడ్డు పక్కన నిర్మించిన నూతన పోలీస్‌స్టేషన్‌ను చూసిన ప్రతిఒక్కరూ కార్పొరేట్ కార్యాలయంలా ఉందంటున్నారు. మూడు అంతస్తుల్లో భవనం, దాని ముందు పచ్చిక బయళ్లు, కాంపౌండ్ వాల్ ముందు పార్కింగ్ సౌకర్యం, ఈశాన్యంలో వాస్తు ప్రకారం నీటి ఫౌంటేన్, లాన్ మధ్యలో అధికారి చిహ్నామైన మూడు సింహాల ఏకశిల విగ్రహంతో ఆకట్టుకుంటుంది. ఎట్టకేలకు నూతన పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభోత్సవానికి నోచుకోవటంతో తమకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు సిబ్బంది చర్చించుకుంటున్నారు.

హోర్డింగ్‌లకు నో చాన్స్

- ఔటర్ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్నవి తొలగించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- తొలగించే ప్రక్రియలో స్థానిక సంస్థలు

శంషాబాద్: ఔటర్ సర్వీసు రోడ్డు పక్కనే ఇకపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వకూడదంటూ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఇప్పటి వరకు ఉన్న వాటిని కూడా వెంటనే తొలగించే చర్యలు కూడా చేపట్టాలన్నారు. ఈ మేరకు ఔటర్ సర్వీసు రోడ్డుకు 15 మీటర్ల లోపు ఉన్న హోర్డింగ్‌లను తొలగించే ప్రక్రియను ఆయా పరిధుల్లో ఉన్న స్థానిక సంస్థల అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31 లోపు ఉన్న పన్నులను సేకరించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి వాటిని పన్నులకు సంబంధించిన నోటీసులు కూడా జారీ చేయకుండా చర్యలు చేపడుతున్నారు. ఒక్క శంషాబాద్ మున్సిపాలిటీలోనే తొండుపల్లి నుంచి కొత్వాల్‌గూడ సర్వీసు రహదారి వరకు మొత్తం 20 హోర్డింగ్‌లను తొలగించే పనిలో శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు చర్యలు షురూ చేశారు. ఇప్పటి వాటిపై ఉన్న ఫ్లెక్సీలను సైతం తీసి వేస్తున్నారు. హోర్డింగ్‌ల తీరు ఔటర్ భవిష్యత్ ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా ఉండడమే కాకుండా కనీసం 15 మీటర్లు దూరం కూడా పాటించకుండానే వీటిని ఏర్పాటు చేయడంతో నిబంధనలను సైతం ఉల్లంఘించినట్లు గుర్తించారు.



తొలగించే జాబితాలో ఉన్న హోర్డింగ్‌లు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. హైదర్షాకోట్‌కు చెందిన శివలింగంకు రూ.46 వేలు, కిస్మత్‌పూర్‌కు చెందిన బండారి యశోదకు రూ.28 వేలు, బండ్లగూడకు చెందిన సయ్యద్‌షఫీకి రూ.26 వేలు, దర్గా ఖలీజ్‌ఖాన్‌కు చెందిన అంజాదుల్లాఖాన్‌కు రూ.14 వేల చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు. దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం కేసీఆర్ పేద ప్రజల పక్షాన నిలపడుతూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు మలాకీరత్నం, జగదీష్, వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్యామ్‌లేట్ రాజు, గౌస్ బేగ్ షానవాజ్, సర్దార్‌బేగ్, అసద్‌బేగ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మణికొండ: పేదలు ఆస్పత్రులలో చికిత్స పొందిన వారు సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. గురువారం ఆయన కోకాపేట గ్రామానికి చెందిన సోమశేఖర్‌కు మంజూరు అయిన రూ. 60 వేల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేలాది మంది పేదలను సీఎం సహాయ నిధి పథకం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిశంకర్, మల్లేష్, గణేష్‌రెడ్డి, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత



మణికొండలో ప్రపంచ నీటి దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నీటి పొదుపుపై కృషి చేస్తున్న సొసైటీ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్, ఎలిమినేషన్ ఆఫ్ పోవర్టీ (ఎస్‌ఎస్‌డీఈపీ) ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో మణికొండలో చేపట్టిన ప్రపంచ నీటి దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు నీటిని ఇష్టారాజ్యంగా వృథా చేస్తున్నారని, అలాంటి వారికి నీటి ఆవశ్యకతను తెలిపేలా మణికొండ మున్సిపాలిటీలో కార్యాక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్‌జీఓ సంస్థ ప్రధాన కార్యదర్శి కె.జ్యోతిబాయి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు మణికొండ మున్సిపాలిటీలో ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, కౌన్సిలర్‌లు వసంతరావు, నవీన్‌కుమార్, నాయకులు రూపారెడ్డి, బషీర్, శ్రీనివాస్‌రావు, లక్ష్మణ్‌రావు, శ్రవణ్, దిలీప్, సందీప్, గంగాధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీ కళాశాలలో..

ప్రపంచ నీటి దినోత్సవాన్ని గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ డాక్టర్ రామరాజు మాట్లాడుతూ.. నీరు, పారిశుద్ధ్య సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రస్తుత నియమాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్ జగన్నాథరావు, మహేశ్వర్‌రెడ్డి, స్టూడెంట్ కో ఆర్డినేటర్ అక్షితప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్ట్ అన్యాయం

గచ్చిబౌలి: తీన్మార్ మల్లన్న అరెస్ట్ అన్యాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత పాత్రపై మల్లన్న గత కొన్ని రోజులుగా చేస్తున్న విమర్శలను తట్టుకోలేక అరెస్ట్ చేసి జైలుకు పంపడం పద్ధతి కాదన్నారు. జర్నలిస్టులను కూడా తెలంగాణలో స్వేచ్ఛగా పని చేయలేని పరిస్థితి వచ్చిందని జర్నలిస్టులంతా ఆలోచించాలని సూచించారు.

మనూ 'సోఫ్రే హాఫ్టసిన్ పట్టిక ఏర్పాటు



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సంప్రదాయబద్ధంగా 'సోఫ్రే హాఫ్టసిన్' పట్టికను ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ సందర్భంగా ఏడు అంశాల అమరికతో పర్షియన్ సబ్జెహ్(గోదుమగడ్డి), సమాను (తీపిపుడ్డింగ్), సెర్కే(వెనిగర్) మొదలైన వాటితో ఇతర తీపి పదార్థాలు, పండ్లను ఒక టేబుల్ ఏర్పాటు చేసి దానిపై అమర్చడం విశేషం. ఈ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఆయన సతీమణి అర్షియా హసన్ తిలకించి ప్రారంభించారు. ప్రముఖ ఉర్దూ, పర్షియన్ కవి డాక్టర్ సయ్యద్ తఖీఅబేది, అలీఅక్బర్ నిరూమండ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ ఆహ్మద్ పాల్గొన్నారు.

శ్రీదేవి కళాశాలలో ఐడియా థాన్ ప్రారంభం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

మణికొండ: వినూత్న ఆలోచనలను ఆచరణలో పెట్టడంతో పాటు ఇతరులతో పంచుకునేందుకు దోహదపడే ఐడియా థాన్ 2023 వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యింది. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం జీవితంలో ఏదైనా సాధించాలంటే వ్యక్తిగత ఆసక్తి ముందుగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ మల్లీశ్వరి మాట్లాడుతూ విద్య మాత్రమే విద్యార్థి భవిష్యత్‌ను నిర్ధారిస్తుందని, స్టార్టప్ ఇండియా, కొత్త విద్యా పాలసీ–2020 ప్రకారం వినూత్న ఆలోచనలు, వ్యవస్థాపకత సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకే ఐడియా థాన్ నిర్వహిస్తున్నామన్నారు. రెండవ సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు 500 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని కన్వీనర్ డాక్టర్ నరేంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఈ క్లిప్స్ సీఈఓ ముదిత జైన్, స్మార్ట్‌బ్రిడ్జ్ అకాడమిక్ డైరెక్టర్ యుక్తేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ మార్కెట్‌పై అమెరికన్ యూనివర్సిటీ దృష్టి

- అమెరికన్ యూనివర్సిటీ అధ్యక్షుడు మార్క్‌పిక్రిస్టెన్‌సెన్



సమావేశంలో పాల్గొన్న మార్క్ పి క్రిస్టెన్‌సెన్, ఇతర ప్రముఖులు

రాయదుర్గం: భారత్ మార్కెట్‌పై పురాతన అమెరికన్ యూనివర్సిటీ ప్రత్యేక దృష్టి సారించిందని అమెరికన్ యూనివర్సిటీ అధ్యక్షుడు మార్క్ పి క్రిస్టెన్‌సెన్ పేర్కొన్నారు. గచ్చిబౌలి స్కైవ్యూలోని కోవర్క్స్‌లో ఇండో గ్లోబల్ స్టడీస్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడారు. భారత్ చాలా పెద్ద దేశమని, విదేశాలలో చదువుకోవడానికి ఇష్టపడే విద్యార్థులకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఏటా 60 మిలియన్ల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్ అవుతున్నారని భారతదేశం నుంచి ప్రతియేటా దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు వెళ్తున్నారన్నారు. క్లార్క్సన్ క్యాంపస్‌లో 1964లో మొట్టమొదటి భారతీయ విద్యార్థి ఉన్నత విద్యనభ్యసించారని గుర్తు చేశారు. గ్లోబల్ యూనివర్సిటీ కావాలనుకుంటే భారతీయ విద్యార్థులకు ముఖ్యంగా తెలంగాణ నుంచి రిక్రూట్ చేసుకోవడం అవసరమన్నారు. భారతదేశం నుంచి క్లార్క్సన్ విద్యార్థుల దరఖాస్తులు గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు 171 శాతం వృద్ధిని పెంచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇండో గ్లోబల స్టడీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అశోక్‌కల్లం, యూనివర్సిటీ ప్రతినిధి భారతసంతతికి చెందిన సీమా గ్రోవర్ క్రిస్టెన్‌సర్ పాల్గొన్నారు.

తట్టు వ్యాధిపై అవగాహన సదస్సు

గోల్కొండ: తట్టు వ్యాధి చిన్న పిల్లలతో పాటు యుక్త వయస్సులో వచ్చే వ్యాధి అని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. గురువారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో కార్వాన్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో తట్టు వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు తట్టుపై ఉన్న అపోహలను తొలగించాలని ఆయన సూచించారు. తట్టు సోకిన వారికి ఇప్పటికీ చాలా మంది ఇంట్లోనే సొంత పద్ధతులను అవలంభిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ ఖాజ్ రవూఫ్ ఉద్దీన్, కార్వాన్‌కు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కార్పొరేటర్ సమీక్ష

గోల్కొండ: రంజాన్ మాసంలో పారిశుద్ధ్య పనులను వెంటనే నిర్వహించాలని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్‌లో బల్దియా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మసీదుల పరిసరాలు, మసీదులకు వెళ్లే రోడ్లపై చెత్తను ఏ రోజుకారోజు తొలగించాలన్నారు. అదే విధంగా డ్రైనేజీ లీకేజీలను కూడా అరికట్టాలని ఆయన సూచించారు. వెలగని వీధి దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రజనీకాంత్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీనా, విద్యుత్ శాఖ డీఈ అశోక్, పారిశుద్ధ్య సూపర్‌వైజర్ కయ్యుం, సుష్మా పాల్గొన్నారు.

నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం



నిరసనలో పాల్గొన్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: ప్రజల పక్షాన నిలపడి ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తు ఊరుకోదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. తప్పుడు ఆరోపణలతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సిట్ కార్యాలయానికి విచారణ కోసం పిలవడం దారుణమన్నారు. ఈ మేరకు గురువారం సిట్ కార్యాలయం ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ అక్రమాల పుట్ట అని తేలిపోయిందన్నారు. ఒకటి కాదు, రెండు కాదు అరడజను ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయని స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్, కేటీఆర్ అండ్ కో నియమించిన సిట్ విచారణకు రేవంత్‌రెడ్డిని విచారణ కోసం పిలవడం దారుణమన్నారు. సీబీఐ, సిట్టింగ్ జడ్జి విచారణ కోసం కొట్లాడుతామన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



ఆరాంఘర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

రాజేంద్రనగర్: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్సార్ తెలంగాణ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సదాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆరాంఘర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద భగత్‌సింగ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్ బాటలో యువత ఉద్యమ స్ఫూర్తితో సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యరెడ్డి, కోలన్ రామ్‌రెడ్డి, కె.నాగేశ్వర్‌రావు, దేవీ, చెన్నయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



కాలనీవాసులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే గాంధీ సానుకూలంగా స్పందించినట్లు టీఎన్‌జీఓకాలనీ రంగారెడ్డి జిల్లా హౌజింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం జంగయ్య తెలిపారు. గురువారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాలనీకి మంజూరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు పనులను ప్రారంభించాలని కోరగా అందుకు ఆయన అంగీకరించారన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ శంకరయ్య, డిప్యూటీ కమిషనర్ వెంకన్నను కూడా కలిసి కాలనీలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించి, ముష్కి చెరువును సుందరీకరించాలని, కాలనీలో ఇక్కట్లు లేకుండా చేయాలని కోరగా వారు కూడా సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. ఎమ్మెల్యే గాంధీని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తేగా అన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జోసెఫ్, రాములు, నర్సింహులు, అశ్రఫ్, జోగారావు, ప్రభాకర్‌రావు, భాస్కర్ ఉన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

గోల్కొండ: క్రీడలతో శారీరకంగా దృఢత్వం లభిస్తుందని టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకుడు హారూన్ ఫరాన్ అన్నారు. గురువారం గోల్కొండ రేతిగల్లిలోని జూరిస్ అల్ఫా హైస్కూల్ వారు స్పోర్ట్స్ అండ్ ఇస్లామిక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలిచిన వారికి హారూన్ ఫరాన్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారన్నారు. గోల్కొండలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తెలంగాణతో పాటు హైదరాబాద్ జిల్లా స్థాయి పోటీలలో పతకాలు సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ మజ్లిస్ నాయకులు బదర్ ఉద్దీన్, లంగర్‌హౌస్ డివిజన్ మజ్లిస్ నాయకులు వజీ ఉజ్‌జమా, సయ్యద్ రఫత్ హుస్సేన్, మజ్లిస్ సీనియర్ నాయకులు షకీల్ అలీఖాన్, పాఠశాల డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్, ప్రిన్సిపాల్ హుమేరా తదితరులున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230